# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 07-09-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫ్రాన్స్ అధ్యక్షులు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో ఈరోజు టెలిఫోన్ ద్వారా సంభాషించారు.

- సైక్లింగ్ ను ప్రోత్సహించేందుకు సైకిళ్లపై జీఎస్టీని 18 నుంచి 5 శాతానికి తగ్గించిందని కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు.

- మరి కొద్ది సేపట్లో సంపూర్ణ చంద్రగ్రహణం ప్రారంభం కానున్నది.

- రాగల రెండు మూడు రోజుల్లో హరియాణా, చండీగఢ్, ఢిల్లీ, ఉత్తరాఖండ్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) హెచ్చరించింది.

==============================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫ్రాన్స్ దేశ అధ్యక్షులు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో ఈరోజు టెలిఫోన్ ద్వారా సంభాషించారు. ఆర్థిక, రక్షణ, సైన్స్, టెక్నాలజీ, అంతరిక్షం సహా పలు రంగాల్లో ద్వైపాక్షిక సహకారం గురించి ఇరువురు నేతలు చర్చించారు. ఉక్రెయిన్ సంక్షోభాన్ని శాంతియుతంగా పరిష్కరించేందుకు భారత్ మద్దతు కొనసాగుతుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. 2026 ఫిబ్రవరిలో భారత్ నిర్వహించనున్న `ఏఐ ఇంపాక్ట్` సదస్సుకు ఆహ్వానాన్ని అంగీకరించిన ఫ్రాన్స్ అధ్యక్షులు మాక్రాన్‌కు నరేంద్ర మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచ శాంతి, సుస్థిరతలను ప్రోత్సహించడం కోసం సంప్రదింపులను కొనసాగించడానికి, కలిసి పని చేయడానికి ఇరువురు నేతలూ అంగీకారం తెలిపారు.

==============================

మరి కొద్ది సేపట్లో సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడనుంది. ఈ చంద్ర గ్రహణం ఆసియా ఖండంలో అనేక దేశాల్లో కనిపించనుంది. దేశ రాజధాని ఢిల్లీతో పాటు ముంబై, కోల్‌కతా, బెంగళూరు వంటి ప్రధాన నగరాల్లో, అలాగే ఆసియా, ఆస్ట్రేలియా, తూర్పు ఆఫ్రికా, యూరప్‌లోని కొన్ని ప్రాంతాలలో గ్రహణం స్పష్టంగా కనిపిస్తుంది. గ్రహణం ఈ రాత్రి 8 గంటల 58 నిమిషాలకు ప్రారంభమై, రేపు తెల్లవారుజామున 2 గంటల 25 నిమిషాలకు ముగుస్తుంది. ఈ గ్రహణంలో సంపూర్ణ దశ 82 నిమిషాల పాటు ఉంటుంది. గ్రహణం ఐదు గంటలకు పైగా కొనసాగుతుంది. ఈ దశాబ్దంలోనే సుదీర్ఘ చంద్రగ్రహణాల్లో ఇది ఒకటి కానుంది.

==============================

సైక్లింగ్ ను ప్రోత్సహించేందుకు.. ప్రభుత్వం సైకిళ్లపై జీఎస్టీని 18 నుంచి 5 శాతానికి తగ్గించిందని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖా మంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. న్యూఢిల్లీలో ఈ రోజు భారతీయ రైల్వేల సహకారంతో 'గర్వ్ సే స్వదేశీ' ఇతివృత్తంతో ఏర్పాటు చేసిన `ఫిట్ ఇండియా - సైకిల్ పై ఆదివారం` కార్యక్రమంలో కేంద్రమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... `సైకిల్ పై ఆదివారం` కార్యక్రమం దేశవ్యాప్తంగా ఒక పెద్ద ఉద్యమంగా మారిందన్నారు. సైక్లింగ్ అత్యుత్తమ వ్యాయామమని, కాలుష్య నివారణకు చక్కని పరిష్కారం కూడా అని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

==============================

రక్షణ రంగ పరిశోధన, అభివృద్ధిలో పాల్గొనడానికి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (MSME)లకు ఇది సరైన సమయమని డీఆర్‌డీవో ఛైర్మన్ డాక్టర్ సమీర్ వి కామత్  తెలిపారు. MSMEలు అంకుర సంస్థలతో కలిసి పని చేసేందుకు డీఆర్‌డీవోకు చెందిన డిఫెన్స్ టెక్నాలజీ అండ్ టెస్ట్ సెంటర్ (DTTC) లక్నోలో సదస్సును నిర్వహించింది. ఈ కార్యక్రమంలో 100కు పైగా ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లు, లఘు ఉద్యోగ్ భారతి ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఆర్‌డీవో ఛైర్మన్ మాట్లాడుతూ... రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆలోచనల నుంచి పుట్టిన డీటీటీసీ.. పరిశ్రమలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తోందని తెలిపారు. 2047 నాటికి 'వికసిత్ భారత్'ను సాధించడంలో భాగంగా.. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు డీఆర్‌డీవో అన్ని విధాలా సహాయం అందిస్తుందని సమీర్ వి కామత్ హామీ ఇచ్చారు.

==============================

వరద పరిస్థితులను సమీక్షించడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 9వ తేదీన పంజాబ్‌లో పర్యటించనున్నారు. వరద బాధితులకు గరిష్ఠ సహాయం అందేలా క్షేత్రస్థాయి వాస్తవాలను, అక్కడి పరిస్థితులను స్వయంగా అంచనా వేయనున్నారు.  కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సైతం పంజాబ్‌లో పర్యటించి వరద పరిస్థితిని అంచనా వేశారు. దీంతో పాటు.. వరదల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి రెండు కేంద్ర అంతర్-మంత్రిత్వ శాఖల బృందాలు కూడా రాష్ట్రంలో పర్యటిస్తున్నాయి.

విరామం

==============================

భూ విజ్ఞాన శాస్త్రాలు, బయోటెక్నాలజీ, అంతరిక్ష సాంకేతికత వంటి అత్యాధునిక రంగాలలో అధ్యయనం చేయడానికి యువత ముందుకు రావడం అభినందనీయమని కేంద్ర శాస్త్ర సాంకేతిక, భూ విజ్ఞాన శాస్త్రాల శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ అన్నారు.  చైనాలో జరిగిన 18వ అంతర్జాతీయ భూ విజ్ఞాన శాస్త్ర ఒలింపియాడ్ (IESO-2025)లో విజేతలుగా నిలిచిన భారత విద్యార్థుల బృందాన్ని ఆయన ఈ రోజు సత్కరించారు. ఈ సందర్భంగా జితేంద్ర సింగ్ మాట్లాడుతూ... గత దశాబ్దంలో భారత్‌లో వచ్చిన స్టార్టప్ విప్లవం తర్వాత.. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల యువతలో ఉత్సాహం పెరిగిందని తెలిపారు. జాతీయ విద్యా విధానం (NEP-2020) యువత సృజనాత్మకతను వెలికితీస్తోందని పేర్కొన్నారు.

==============================

దీపావళి నాటికి వస్తు సేవల పన్ను (GST) సంస్కరణలు తీసుకొస్తామన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హామీకి అనుగుణంగా... ఈ నెల 3న జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పన్ను రేట్ల హేతుబద్ధీకరణకు ఆమోదం లభించింది. ఇది వరకు ఉన్న 5, 12, 18, 28 శాతం శ్లాబులతో కూడిన నాలుగు అంచెల పన్నుల వ్యవస్థను 5, 18 శాతంతో కూడిన రెండు అంచెల వ్యవస్థగా మార్పు చేశారు. ఈ నెల 22 నుంచి ఈ సంస్కరణలు అమల్లోకి రానున్నాయి. జీఎస్టీ సంస్కరణలు ఈ-కామర్స్ రంగంలో ఆన్‌లైన్ షాపింగ్‌ను చౌకగా మార్చనున్నది. జీఎస్టీని 5 శాతానికి తగ్గించడంతో ప్యాకేజింగ్ వస్తువుల ధరలు తగ్గనున్నాయి. ముఖ్యంగా ఎంఎస్ఎంఈలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ఇది ఎంతో మేలు చేస్తుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పంజాబ్, జమ్మూ కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్‌లలో వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. భారత వైమానిక దళం 541 మందిని రక్షించింది. 10 టన్నులకు పైగా నిత్యావసర వస్తువులను విమానాల్లో తరలించింది. జమ్మూ-కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్‌లలో కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల్లో వైమానిక దళం పెద్ద ఎత్తున సహాయక చర్యలు చేపట్టింది. ఐఏఎఫ్ పశ్చిమ వైమానిక దళం సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తూ... బార్మేర్ - చంబా సెక్టార్ నుంచి 541 మందిని, కిష్త్వార్ సెక్టార్ లో 10 వేల కిలోల నిత్యావసరాలను విమానాల్లో తరలించినట్లు పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాగల రెండు, మూడు రోజుల్లో హరియాణా, చండీగఢ్, ఢిల్లీ, ఉత్తరాఖండ్‌లోని పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) హెచ్చరించింది. తమిళనాడు, కేరళ, లక్షద్వీప్, కోస్తాంధ్ర, యానాంలలోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈశాన్య రాష్ట్రాలైన అస్సాం, నాగాలాండ్, మణిపూర్, మిజోరం, త్రిపురలో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని తెలిపింది. మరోవైపు, రాబోయే 5 రోజుల పాటు కోస్తాంధ్ర, యానాం, రాయలసీమ ప్రాంతాల్లో బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్త ఉమా శంకర్ దాస్ పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆర్చరీ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత పురుషుల జట్టు చరిత్ర సృష్టించింది. పురుషుల టీమ్ విభాగంలో తొలిసారిగా స్వర్ణ పతకం సాధించింది. దక్షిణ కొరియాలోని గ్వాంగ్జులో ఈ రోజు జరిగిన ఫైనల్లో ఫ్రాన్స్‌పై 235-233 తేడాతో విజయం సాధించింది. మిక్స్‌డ్ టీమ్ విభాగంలో జ్యోతి సురేఖ, రిషబ్ యాదవ్ ద్వయం ఫైనల్లో నెదర్లాండ్స్ చేతిలో 155-157 తేడాతో ఓటమి పాలై రజత పతకం సాధించారు. అయితే రిషబ్ యాదవ్ మళ్ళీ పుంజుకొని సహచర ఆటగాళ్ళు అమన్ సైనీ, ప్రథమేశ్ ఫ్యూగేతో కలిసి భారత పురుషుల జట్టుకు స్వర్ణ పతకాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శ్రీ నారాయణ గురు జయంతి సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాళులర్పించారు. సమాజంపై ఆయన చూపిన ప్రభావం, దూరదృష్టిని ప్రధానమంత్రి గుర్తు చేసుకున్నారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా నరేంద్ర మోదీ ఒక పోస్ట్ చేస్తూ.. శ్రీ నారాయణ గురు బోధించిన సమానత్వం, కరుణ, విశ్వ సోదరభావం నేటికీ ఎంతగానో స్ఫూర్తినిస్తున్నాయని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =